క్లుప్తంగా

కుమారస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

గుడి నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో జంబులమ్మ గుడి నిర్మాణానికి వేంపెంట సొసైటీ చైర్మన్, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు రూ.20వేలు విరాళం అందజేశారు. మంగళవారం మండల కేంద్రంలో గుడి నిర్మాణ కమిటీ సభ్యులకు నగదును అందజేయడం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చరణ్, ఆలయ కమిటీ సభ్యులు మనోహర్, ఈశ్వరయ్య, మౌలాలి, మద్దిలేటి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక



సంతోష్‌రాజ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

పాములపాడు: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు మనక్ ప్రదర్శనకు మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ హై స్కూలు 10వ తరగతి విద్యార్థి సంతోష్‌రాజు ఎంపికైనట్లు హెచ్‌ఎం కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం విద్యార్థినిని ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో సెయింట్‌జోసఫ్ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సంతోష్ రాజ్ తక్కువ ఖర్చుతో సోలార్ అగ్రికల్చర్ పెస్టిసైడ్స్ స్ప్రేయర్ విత్‌లో కాస్ట్ చేసే విధానం ప్రదర్శించగా మొదటి స్థానం సాధించాడన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికకావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు గైడ్ టీచర్ చెన్నయ్యను అభినందించారు.

మరింత మెరుగైన సేవలు అందించాలి

వెలుగోడు: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ సూచించారు. సకాలంలో పీఎం కిసాన్ లబ్ధి కొరకు ఈ–కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడారు. రబీలో సాగుచేసిన పంటలు 100 శాతం ఈ–క్రాప్ నమోదు పూర్తి చేసినందుకు సిబ్బందిని అభినందించారు. అలాగే ఈ–కేవైసి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓ సుధారాణి, నాగ శివ సాయి, ఆర్బీకే సిబ్బంది నాగమణి, రామలక్ష్మి, వెంకట శివ, రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దొంగల అరెస్టు

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని లలితాంబికా బజారులో గత నెల 23న షాపు నం ఎఫ్ -3 లో చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ముఖద్వారం వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా, పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు పారిపోవడం గమనించి వారిని పట్టుకుని విచారించగా, లలితాబజారులో చోరీకి పాల్పడట్లు ఒప్పుకున్నారని చెప్పారు. మాచర్లకు చెందిన హరిబాబు, శంకర్‌పై మాచర్ల టౌన్, రెంట చింతల, తెలంగాణ రాష్ట్రంలో కూడా చోరీ కేసులు ఉన్నాయని, వీరు జైలుకు కూడా వెళ్లివచ్చారని తెలిపారు. గత నెల 20న శ్రీశైలంలోని డార్మెటరీలో సాధారణ భక్తులతో కలిసి తిరుగుతూ మూడురోజులపాటు ఇక్కడే ఉండి, జనవరి 23న లలితా బజారులో చోరీ చేసి పారిపోయినట్లు వెల్లడించారు. నిందితులను రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

ల్యాబ్‌లతో విద్యార్థుల్లో నైపుణ్యాలు



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

మిడుతూరు: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రయోగశాలలు దోహదపడతాయని జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ (నూతన ప్రయోగశాల)ను ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మతో కలసి ప్రారంభించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రయోగశాలను సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయి తిమ్మయ్య, ఎంఈఓ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఓబులేసు, సైన్సు ఉపాధ్యాయులు ఎల్లస్వామి, నాగరమేష్ ల్గొన్నారు.

అల్లారు ముద్దుగా జగనన్న గోరుముద్ద

- పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ఆకర్షణీయమైన మెనూ
- పోషక విలువలతో కూడిన అన్నంతో పాటు గుడ్లు, చిక్కీలు
- ఇష్టంగా ఆరగిస్తున్న విద్యార్థులు



నందికొట్కూరు బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న బాలికలు

నందికొట్కూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న చిన్నారుల యోగక్షేమాలకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. తల్లిదండ్రులు ఎలాగైతే అల్లారు ముద్దుగా భోజనం పెడతారో అలాగే పాఠశాలల్లో పిల్లలకు అందించే జగనన్న గోరుముద్ద విషయంలోనూ సర్కారు ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. బలవర్ధకమైన పౌష్టికాహారంతో కూడిన ఆకర్షణీయ మెనూతో రోజుకో కొత్త రుచి కరమైన వంటకం వడ్డిస్తోంది. పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ రైస్‌తో పాటు కోడిగుడ్లు, చిక్కీలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది. ఫలితంగా రోజురోజుకూ బడుల్లో మధ్యాహ్నభోజనం తినే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం 90 శాతానికి పైబడి విద్యార్థులు విద్యార్థులు జగనన్న గోరుముద్ద తింటున్నారు. గత ప్రభుత్వంలో మధ్యాహ్నభోజనం తిన్నేవారి సంఖ్య 50 శాతం దాటలేదు.

33,836 మంది విద్యార్థులు

నందికొట్కూరు నియోజకవర్గంలో 259పాఠశాలలు ఉన్నాయి. ఇందులో గవర్నమెంట్ హైస్కూళ్లు 2, జెడ్పీ హైస్కూళ్లు 32, యూపీ 31, ప్రైమరీ 182, ఐటీడీఏ 2, గురుకులం 2, మోడల్ స్కూళ్లు 4, కస్తూర్బా 4 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 33,836 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఏజెన్సీలకు అండగా ప్రభుత్వం

జగనన్న గోరుముద్ద అందిస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీలకూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా కేటాయింపులు చేస్తోంది. ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు కోడిగుడ్లు, బెల్లం, వేరుశనగపప్పుతో తయారు చేసిన చిక్కీలను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. ఎప్పటికప్పుడు సక్రమంగా బిల్లులు చెల్లిస్తుంది. గత ప్రభుత్వం ఏజెన్సీలను ముప్పతిప్పలు పెట్టింది. ఎప్పుడూ సక్రమంగా బిల్లులు చెల్లించిన పాపాన పోలేదు. దీంతో ఏజెన్సీలు అప్పులతో సతమతమయ్యేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏజెన్సీలు చాలా ఆనందంతో జగనన్న గోరుముద్ద పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాయి.

కేటాయింపులు ఇలా..

ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో ఒక్కో విద్యార్థికి మధ్యాహ్న భోజనం ద్వారా గతంలో కేటాయించిన రూ. 4.97ను ప్రస్తుతం ప్రభుత్వం 5.55 రూపాయలకు పెంచింది. ఉన్నత పాఠశాల స్థాయిలో ఒక్కో విద్యార్థికి రూ. 7.45 ఇవ్వగా, ప్రస్తుతం రూ.8.17 రూపాయలకు జగనన్న ప్రభుత్వం పెంచింది.



మధ్యాహ్న భోజనం కోసం క్యూలో నిలబడిన బాలికలు

ప్రతి నెల 10వ తేదీలోపు బిల్లులు

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లుల చెల్లింపులనూ ప్రభుత్వం పటిష్టంగా చేపట్టింది. జగనన్న గోరుముద్ద సైట్‌లో ప్రతి నెలా 5వ తేదీలోపు బిల్లులను అప్‌లోడ్ చేసిన తరువాత 10వ తేదీలోపు చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకుంది. గతంలో నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండేవి.

భోజనం చాలా రుచికరంగా ఉంది



మధ్యాహ్న భోజనం చాలా రుచికరంగా ఉండడంతో పాఠశాలలోనే రోజూ తింటున్నాం. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారు. గతంలో మధ్యాహ్న భోజన రుచిగా ఉండేది కాదు. ఇంటి అన్నం తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. – రాజేష్, 8వ తరగతి, గవర్నమెంట్ హైస్కూల్, నందికొట్కూరు

కడపునిండా తింటున్నాం



మా స్కూల్‌లో మధ్యాహ్న భోజనంలో రోజూ బలమైన ఆహారం వడ్డిస్తున్నారు. అంతే కాకుండా రుచికరంగా వండుతున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం భోజన రుచికరమైన ఆహారం పెడుతున్నారు. అందుకే రోజు కడుపు నిండా తింటున్నాం.

– షాహీనా, 9వ తరగతి, బాలికల హైస్కూల్, నందికొట్కూరు

ప్రతి నెలా బిల్లులు వస్తున్నాయి



విద్యార్థులకు సమయానికి మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నాం. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నందుకు ప్రతి నెలా సక్రమంగా బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తోంది. గతంలో ఆరు నెలలకు కూడా బిల్లులు వచ్చేవి కావు. బిల్లులు అందక అప్పులు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం అటువంటి పరిస్థితులు లేవు.

– మరియమ్మ, వంట నిర్వాహకురాలు

రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన



ఎడ్లబలప్రదర్శన పోటీలు ప్రారంభిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

మహానంది: బండిఆత్మకూరు మండలం జి.లింగాపురంలో చర్చి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను నిర్వహించారు. పోటీలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేతలు శిల్పా కార్తీక్‌రెడ్డి, శిల్పా భువనేశ్వరరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. అందులో భాగంగానే పోటీల్లో గెలుపొందే వృషభాలకు ప్రథమ బహుమతి కింద రూ.50వేలు అందించారని చెప్పారు. ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ రాధమ్మ, ఎంపీటీసీ అర్జున్, నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తపల్లిలో 'ఆసరా'

కొత్తపల్లి: మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీఎం పుల్లయ్య మంగళవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కార్యక్రమం ఉంటుందని, గ్రామాల నుంచి పొదుపు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు సచివాలయం, ఆర్బీకేల ప్రారంభం

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో బుధవారం గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించనున్నట్లు సర్పంచ్ రవియాదవ్ తెలిపారు.

మహిళలకు పెద్ద పీట

- సంక్షేమ పథకాల్లో వారికే ప్రాధాన్యం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సుధీర్ దారా
- పాములపాడులో వైఎస్సార్ ఆసరా సంబరాలు
- 7,675 మందికి రూ.4,93,00,000 విడుదల



పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న డాక్టర్ సుధీర్ దారా

పాములపాడు: రాష్ట్రంలో మహిళలకు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సుధీర్ దారా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 4వ విడత వైఎస్సార్ ఆసరా ఉత్సవం నిర్వహించారు. పొదుపు మహిళలతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలంలోని 768 గ్రూపులకు 7675 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా 4వ విడత మంజూరైన రూ.4,93,00,000కు సంబంధించిన మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకంలో లబ్ధిదారులుగా మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి సంఘంలో అత్యున్నత స్థానం కల్పించారన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందిన మహిళలే వైఎస్సార్‌సీపీకి స్టార్ క్యాంపెయినర్లని సీఎం చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే ఓటు వేయండని ధైర్యంగా అడిగిన మొదటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రభుత్వ అధికారులు, పాలకులు, వలంటీర్ల సేవలతోనే విజయవంతంగా ప్రజల వద్దకు సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు.

చంద్రబాబు చేసిందేమీలేదు

ప్రతి పక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు మాత్రం కంప్యూటర్‌ను తానే కనిపెట్టానని, రోడ్లు తానే వేశానని, నీరు నేను తెచ్చానని ప్రగల్భాలు పలకడం తప్పా చేసిందేమి లేదని విమర్శించారు. జగనన్నను ఎదుర్కొనే దమ్ములేక అభ్యర్థులు కరువై ఇతర పార్టీల పొత్తు కోసం తహతహలాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, ఏపీఎం అనురాధ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచు విజయసింహారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శీలారెడ్డి, సర్పంచులు రామస్వామి, వరప్రసాద్,కోట్ల చంద్రారెడ్డి, నారాయణ, మౌలాలి, సొసైటీ చైర్మన్లు చౌడయ్య, వెంకటస్వామి, గద్దం క్రిష్టారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు

సీఎం జగనన్నతోనే సంక్షేమ రాజ్యం

నందికొట్కూరు: జననేత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సుంకులమ్మ దేవాలయంలో జగనన్న మళ్లీ సీఎం కావాలంటూ డాక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. 3, 24వ వార్డులో కౌన్సిలర్లు చాంద్‌బాష, కృష్ణ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన తెచ్చిన సీఎం వైఎస్ జగనన్నకు ప్రజలు అండగా నిలవాలన్నారు. అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందని గుర్తు చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు లాలు, రవూఫ్, హమీద్, నాయబ్, కో ఆప్షన్ సభ్యులు గపార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు శంకర్, శాలు, ముర్తుజా, శాలుమియ్యా, రఫి తదితరులు పాల్గొన్నారు.



24వ వార్డులో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సుధీర్

పేదల ఆరోగ్యం ప్రభుత్వ ధ్యేయం



ముసలిమడుగులో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచు జమిలాబీ

కొత్తపల్లి: పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ జవహర్ బాబు, సర్పంచు శివపురం జమిలాబీ అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ముసలిమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యులు జబీర్ ఆధ్వర్యంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్, ఇతర వ్యాధులకు, దృష్టిలోప నిర్ధారణ పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేశారు. క్యాంపులో భాగంగా 481 మంది వైద్యసేవలు సద్వినియోగం చేసుకోగా, 28 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, కంటివైద్య నిపుణుడు షేక్షావలి, చిన్నపిల్లల వైద్యులు షౌకత్ ఖాదిర్, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

507 మందికి వైద్య పరీక్షలు

పగిద్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో మంగళవారం సర్పంచ్ సుజాత అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడుత వైద్య శిబిరం నిర్వహించారు. క్యాంప్‌లో 507 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తూర్పు ప్రాతకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి క్రిష్ణమూర్తి తెలిపారు.

మెరుగైన వైద్యం అందించేందుకే..

మిడుతూరు: గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సర్పంచ్ ఉషారాణి, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని నాగలూటి గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలోఎంపీడీఓ గంగావతి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, వైద్యులు సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణోత్సవం



అలంకరణలో మహానందీశ్వరస్వామి, అమ్మవార్లు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఉదయం స్థానిక అలంకార మండపంలో మంగళవారం నిత్య కల్యాణోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ముందుగా వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, మాంగల్యధారణ, అక్షతల సమర్పణ పూజలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం తిలకించి ప్రసాదాలు స్వీకరించారు.

16న సూర్యనారాయణ స్వామి కల్యాణం

నందికొట్కూరు: రథసప్తమి సందర్భంగా పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీ ఛాయ ఉషాసమేత సూర్యనారాయణ స్వామి కల్యాణం, రథోత్సవం ఈనెల 16న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సురేష్‌కుమార్, నాగభూషణరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు స్వామి వారికి అభిషేకం, 8 నుంచి 10 గంటల వరకు రథ సప్తమి, దాతల కుంకుమార్చన కార్యక్రమం, 10 గంటల నుంచి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 1 గంటలకు స్వామి వారి తీర్థ ప్రసాదం, 3 గంటల నుంచి పురవీధుల గుండా కల్యాణ మూర్తుల ఊరేగింపు ఉంటుందని చెప్పారు. కల్యాణంలో కూర్చునే దంపతులు రూ.300 చెల్లించి గోత్రనామములు నమోదు చేయించుకోవాలని కోరారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే ఉపేక్షించం

జూపాడుబంగ్లా: మండల రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో ఎక్కడైనా అనుమతుల్లేకుండా మట్టితవ్వకాలు చేపడితే ఉపేక్షించేదిలేదని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని తంగడంచ, మండ్లెం, తరిగోపుల, రెవెన్యూ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టితవ్వకాలు చేస్తున్న వాహనాలను నిలుపుదల చేయించినట్లు తెలిపారు. తహసీల్దార్, మైనింగ్ అధికారుల అనుమతుల్లేకుండా కొంత మంది కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా అక్రమంగా మట్టితవ్వకాలు చేస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్ఏ లను పురమాయించి అక్రమతవ్వకాలు చేస్తున్న ప్రాంతాలను పరిశీలించి తవ్వకాలను నిలిపివేయించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మట్టితవ్వకాలను పాల్పడితే వాహనాలను సీజ్‌చేస్తామని హెచ్చరించారు.

అలరించిన భూకైలాస్ హరికథ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన టి.సాయిరాం భాగవతార్ వారిచే భూకైలాస్ పై హరికథ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కీబోర్డు సహకారాన్ని పి.ధనుంజయ, మృదంగ సహకారాన్ని పి.ప్రసాద్ అందించారు.

సరోజినీ నాయుడును ఆదర్శంగా తీసుకోవాలి

శ్రీశైలంప్రాజెక్ట్: భారతకోకిల సరోజినీ నాయుడును ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొండారెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో సరోజినాయుడు జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ప్రతిరంగంలో మహిళలు ముందుండాలన్నారు. అధ్యాపకులు సూర్యనారాయణ, మౌనిక, శివశంకర్ పాల్గొన్నారు.

మిడుతూరులో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

మిడుతూరు: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జగన్ మోహన్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.

మహానందిలో వసతిగృహాలకు నేడు భూమిపూజ

మహానంది: మహానంది దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించనున్న 55 వసతి గృహాల నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో భక్తులకు వసతి గృహాల కొరతను గుర్తించి 100 నిర్మించాలన్న ప్రతిపాదనను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి దేవదాయశాఖ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి రూ. 10.50 కోట్లతో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయించారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

ఎన్నడూ లేని విధంగా పట్టణంలో అభివృద్ధి



4వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 2వ వార్డులో రూ.49 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, 4వ వార్డులో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్టణంలో సీసీ రోడ్లకు, డ్రైనేజీ నిర్మాణ పనులకు రూ.16 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. టీడీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. పట్టణాభివృద్ధికి పెద్ద పీట వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి బాలమద్దయ్య, కౌన్సిలర్లు బోయ జయమ్మ, నాయబ్, కో ఆప్షన్ సభ్యులు గఫార్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, రాజు, అబ్దుల్లా, కుర్వ శ్రీను, శాలిబాషా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బొల్లవరం, దామగట్ల, బ్రాహ్మణకొట్కూరు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ దామోదర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలోని మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం ఉందా లేదా అని బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

వెలుగోడు: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ విజయకుమారి సందర్శించారు. వేల్పనూరు, రేగడగూడురు, గుంతకందాల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వీఆర్‌ఓలు జబివుల్లా, వెంకట శివుడు, ఉగ్ర నరసింహుడు ఉన్నారు.

పెద్దవెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఆదుకోవాలి

జూపాడుబంగ్లా: కేసీ కాల్వలో బట్టలు శుభ్రం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతిచెందిన నందికొట్కూరు పట్టణానికి చెందిన చాకలి పెద్దవెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం మంజూరు చేసి ఆదుకోవాలని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు నాగభూషణం, డిమాండ్ చేశారు. మంగళవారం వారు జూపాడుబంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూధోబీఘాట్లు లేక రజకులు చెరువులు, కాల్వల్లో బట్టలు శుభ్రం చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామాల్లో ధోబీఘాట్లు నిర్మించాలని చాలని కోరారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి



ఎస్ఐ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న డీఎస్పీ

ఆత్మకూరు: ప్రతి ఉద్యోగి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పట్టణం పోలీసుస్టేషన్ ఎస్ఐ కృష్ణమూర్తి బదిలీపై కర్నూలు జిల్లా మాదవరం పోలీసు స్టేషన్‌కు వెళ్తున్న సందర్భంగా మంగళవారం స్టేషన్ ఆవరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు సీఐ నాగభూషణం, ఆర్బన్ సీఐ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది ఎస్ఐ కృష్ణమూర్తిని సన్మానించారు.

కలెక్టర్ దృష్టికి చెంచుగిరిజనుల సమస్యలు



జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని చెంచుగిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను నంద్యాల జిల్లాకలెక్టర్ కె.శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లినట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్‌ను నంద్యాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు నిర్వహించేందుకు అటవీశాఖ అభ్యంతరాలు వస్తున్నాయని, వాటిని అధిగమించేందుకు ఆ అధికారులను ఆదేశించాలని కోరినట్లు తెలిపారు.

వసతిగృహ ఏర్పాటుకు స్థల పరిశీలన



కొట్టాలచెరువు పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ

ఆత్మకూరు: మండలంలోని కొట్టాలచెరువులో నూతన వసతి గృహ ఏర్పాటు కోసం జిల్లా విద్యాధికారి సుధాకర్ రెడ్డి మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ కొట్టాలచెరువు గూడెంలో ప్రధానమంత్రి ఆదివాసి న్యాయ్ మహాభియాన్ కింద నూతన వసతిగృహం ఏర్పాటు చేస్తామన్నారు. 50 మంది విద్యార్థులతో వసతిగృహన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.2.30కోట్లు మంజూరు చేసిందని చెప్పారు.అనంతరం కురుకుంద జిల్లాపరిషత్ హైస్కూల్‌ను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వచ్చే పబ్లిక్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం కొట్టాలచెరువు, కురుకుందలలో ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ జానకీరాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.